అందుకే,

ఆ తరవాత,

గొప్ప పేరు వచ్చిన తరవాత వారు ఏది చేసినా బాగుందనే అరసిక శిఖామణులు ఎక్కువగా వున్నా, కొంచెం మన్నితత్వం, మరి కాస్త స్పందన వున్న ఏ ఒకరిద్దరో.

"ఆమె పాట అదోలా వుందేమిటో..." అన్నప్పుడు.

నాకు అర్థమయింది. ఆమెకి ఏమిటి కాదో అలా అనుకున్నప్పుడు నాకు గుర్తుకు వచ్చేది అతని నవ్వే.

ఆ తరవాత కొద్ది కాలానికి...

ఆమె అతడి కుటుంబానికి చేసిన గొప్ప సహాయాలు, తయారు చేసిన గొప్ప గొప్ప సంస్థలు. ఎంతో మందికి ఉపాధికి కావలసిన ఏర్పాట్లు.

ఇవన్నీ వింటూనే వున్నాను. ఆమెకు మళ్ళీ ఇంటర్నేషనల్ అవార్డే వచ్చిందని తెలిసి వెళ్ళాను.

"ఏమిటదంతా?" అడిగాను. ప్రపంచం కోసం, పేరు కోసం దానధర్మాలు చేసే "నైచ్యం" ఆమెలో లేదు. అందుకే అడిగాను "ఏమిటది?" అని.

"రిహాబిలిటేషన్... "ఇదంతా నా కోసమే...

"అంటే?" ఆలోచిస్తూ అడిగాను. ఆమె ట్రస్టులన్నీ ఏవో పొడక్షరాల పేరుతో వున్నాయి. నాకు తెలుసు అవన్నీ విప్పితే దానికర్థం అతని పేరేనని.

"అతను బ్రతికుండగా ఎక్కడో వున్న అతని భావన నాకు గొప్ప అనుభూతి నిచ్చేది. కానీ ఆ తరవాత "లేదు" అన్న ఆలోచన నుంచి ఎదిగి గాలిలోనించి ఆ భావం పొందే శక్తి నాకు లేదు.

అందుకే, అతని భావనను నా గుండెల్లోనించి విస్తరింపచేసి నా చుట్టూ ఈ రకంగా పరుచుకుంటూ వస్తున్నాను. ఇది నాలోనించి ప్రవహించి, వెన్నెల్లా విస్తరించి మళ్ళీ నాలోకి వచ్చి నా నరనరాల్నీ తడుపుతోంది ఆ తృప్తి... అది మీకు అర్థమై వుంటుంది.

అదే... మళ్ళీ అనుభూతిగా మారి నా గొంతులోని మామూలు తీయదనాన్ని, నమ్మకాన్ని కలిగిస్తోంది.

అందుకే నా గొంతు మళ్ళీ మామూలుగా పాడుతోంది." నవ్వుతూ చెప్పింది. ఆవిడ కొంత డబ్బు ఇలా వినియోగించడానికి తన ఇంట్లో ఎంత పోరాడి వుంటుందో నాకు తెలుసు. ఆవిడ కోసం ఆవిడ బ్రతకడం ప్రారంభించింది.

నాకు అర్థమైంది ఆమె పోగొట్టుకున్నదేమిటో అది మామూలే. చాలా మందికి ఈ "సలువు" తెలుసు.

కానీ ఆవిడకు అర్థమైంది దాన్ని తిరిగి ఎలా పొందాలో.

తలవంచి నమస్కరించాను.

ఆవిడలో మహా గాయకురాలికే కాదు. ఎదిగిన మనిషికి కూడా.

అందుకే...

ఆ మర్నాడు ఆవిడ గురించి వ్యాస్ రాసి కంటెయ్ నర్‌కు ఇవ్వలేదని తిట్లు తిన్నాను ఎడిటర్‌గారి చేత.

కాని...

ఎలా రాయనూ? ఏమి రాస్తే అదేమిటో ఎవరికి అర్థమౌతుంది?... మామూలు తడిలేని మాటలు... ప్రాణం లేని శబ్దాలు... ఎలా రాయను ఆమె గురించి?!

*

# వాస్తుశాస్త్ర పరంపర-3

## తూర్పు, ఉత్తర, ఈశాన్యాలు పల్లంగా వుండాలా?

ఇంటికోసం స్థలం కొనుక్కోబోయే ముందు ముఖ్యంగా చూడాల్సినవాటిలో తూర్పు. ఉత్తర, ఈశాన్యాలు తప్పకుండా మిగిలిన దిశలన్నిటి కంటే పల్లంగా (అంటే ఎత్తు తక్కువగా) వుండాలి అనే విషయం. అయితే కొంత మంది ఇవేవీ గమనించకుండా స్థలం కొనుక్కుంటారు. అలాంటప్పుడు స్వాభావిక సిద్ధంగా నేల పైన చెప్పినదానికి వ్యతిరేకంగా వున్నప్పుడు ఆ స్థలాన్ని ఈశాన్యం మూల వైపుకు పల్లం చేసుకొన్న తర్వాతనే గృహ నిర్మాణం ప్రారంభించడం ఎంతో మంచిది.

ఇల్లు మొత్తంగా చూసినప్పుడు దక్షిణ, నైఋతి దిశలు కొంత ఎత్తుగానూ, తూర్పు, ఉత్తర, ఈశాన్యాల వైపు వాలుగాను వుండేటట్లు గచ్చు చేయించుకోవాలి. ఎక్కడ నీరు పోసినా తూర్పు, ఈశాన్య, ఉత్తరం వైపుంకే పారాలి. ఇది అతి ముఖ్యమైన విషయం.

మద్రాసులో ఒక కోటీశ్వరుల ఇల్లు చూడడం జరిగింది. ఆ ఇంట్లో లోపల నలు చదరంగా పెద్దగొయ్యి తీసి దాన్లో సోఫాలు వేశారు. పై నుంచి 'షాండిలియర్' వ్రేలాడ తీస్తారు. ఆ గొయ్యి, సోఫాలు, షాండిలియర్ ఇవన్నీ చూసేవాళ్ళకు ఎంతో అద్భుతంగా వున్నాయి. అయితే ఆ గొయ్యి మాస్తే దక్షిణం వైపుగా వుంది. అంటే మిగిలిన దిశలన్నిటి కంటే దక్షిణం పల్లం అయింది. వెంటనే దాన్ని మూసి వేయండని సలహా ఇవ్వడం జరిగింది. అంతే కాకుండా ఆ గొయ్యి ప్రాంతంలో ఒక అంగుళం ఎత్తుగా కట్టి సోఫాలు, అవీ వేసుకోటం మంచిదని చెప్పాను. ఆ గృహ యజమాని ఆ మార్పు చేయించారు. అప్పటివరకూ సుప్రీం కోర్టులో వాళ్ళ కర్మాగారానికి సంబంధించిన కేసు ఎటూ తేలక పీకులాటగా వున్న పరిస్థితి హఠాత్తుగా ఆ యజమానులకు ఎంతో లాభకరంగా, అనుకూలంగా తిరిగింది. నేను కలిసే వరకు వాళ్ళకు ఆ యోగం వుంది కాబట్టి కోర్టు ఇబ్బందితో గడిచింది. వాళ్ళ యోగం బాగుపడే సరికి నేను వెళ్ళడం, సలహా ఇవ్వడం, వాళ్ళు పాటించడం, వారికి మంచి జరగటం వరుసగా సంభవించాయని పాఠకులు గ్రహించాలి.

ఈ మధ్య 'బాసర' క్షేత్రానికి వెళ్ళటం జరిగింది. ఇది బాసర క్షేత్రం. నిజామాబాదుకు 25 కిలోమీటర్ల దూరంలో వ్యాస మహర్షిచే ప్రతిష్ఠించబడిన జ్ఞాన సరస్వతీ దేవాలయం ఇక్కడ వుంది.

మన దేశంలో శాప కారణంగా బ్రహ్మదేవునికి ఆలయాలు లేకుండా పోయాయి. వారి సతీమణి సరస్వతీ దేవి గారికి ఇంకేం ఆలయాలుంటాయి. అయితే వ్యాస మహర్షి దేశాటన చేస్తూ ఈ పవిత్ర స్థలంలో జ్ఞాన సరస్వతి దేవాలయం నిర్మించారు. ఇదే స్థల మహాత్మ్యం అంటారు. ఇప్పుడే అడవిగా వున్న ప్రదేశ అప్పుడు ఈ అడవిలో ఆ మహర్షి సంకల్పం ఏమిటి? గోదావరి తీరం అది. తపోబలంతో స్థల బలం కనుక్కొని అక్కడ ఆలయ నిర్మాణం సాగించారు.

సరస్వతీ దేవిని దర్శించిన ప్రతివారికీ ఆ విగ్రహం లోని వర్చస్సు, తేజస్సు కొట్టవచ్చినట్టు కనబడుతుంది. పవిత్ర క్షేత్రం. ఎందరో కవులు, పండితులు ఈ సరస్వతీ దేవి ఉపాసన చేసి లబ్ధి పొందారు. అయితే ఈ గుడిలో వాస్తు విరుద్ధంగా ప్రభుత్వం వారు కొన్ని కట్టించారు. దాంతో ఎంతో అభివృద్ధి చెందాల్సిన ఈ క్షేత్రంలో అభివృద్ధి కొరవడింది.

అమ్మవారి ముఖం ఉత్తరం వైపు చూస్తున్నది. ఆలయానికి ఎదురుగుండా కొండలు ఉత్తరం వైపు ఎత్తు అయ్యాయి. దక్షిణాన్ని పల్లం చేస్తూ. ఈ కొండల గుట్టలు వ్యాస మహర్షి ప్రతిష్ఠించినప్పుడు వుండి వుండక పోవచ్చు. తరువాత కాలం మార్పులో వేల సంవత్సరాలు గతించాక ఈ గుట్టలు ఏర్పడి వుంటాయి. చుట్టూ కట్టిన ప్రాకారం లోపల కూడా నేల దక్షిణం వైపు పల్లంగానూ, ఉత్తరం వైపుకు ఎత్తుగాను వుంది. ఇది వాస్తు శాస్త్ర విరుద్ధం. ముందు ఈ నేలను సక్రమంగా చేయాలి.

ఆ తరువాత అమ్మవారి ఆలయం ఎదురుగా ఎత్తుగా ప్లాట్‌ఫారంలా చేసి ఒక రేకుల షెడ్డు కట్టారు. దాన్లో హోమగుండం ఏర్పాటు చేశారు. దీంతో దక్షిణం పల్లం అయి అంత శక్తి గల అమ్మవారు పల్లంలో వుండిపోయారు. ఈ రేకుల షెడ్డు వుంచినా ముఖ్య దేవాలయాన్ని పల్లం చేయబడిన ఎత్తు అంతా తీసివేయాలి. అంతే కాకుండా ఈశాన్యం మూలలో పనికి రాని ఇటుకలన్నిటినీ పేర్చి ఆ మూల భారం పెంచారు. మూసివేశారు. ఇది తప్పే.

దక్షిణం పల్లం అనేది పెద్ద లోపం. ఈ లోపాన్ని సరిచేస్తే ఈ 'బాసర క్షేత్రం'కి వచ్చే జన సంఖ్య, రాబడి పెరుగుతాయి. సరస్వతీదేవి కటాక్షం చాలా మంది యాత్రికులకు దక్కుతుంది. ప్రభుత్వం ఈ విషయంలో మేల్కొంటుందా!

ప్రజలు నిజమైన శాస్త్రం ఏదో తెలుసుకొన్ననాడు ప్రభుత్వాన్ని నిలదీయగలరు. ఏది నిజమో ఏది అబద్ధమో ప్రజలకే తెలిసి పరిస్థితి దాటినప్పుడు ఇవన్నీ సంభవిస్తాయని ఆశిద్దాం.

'సాదిల'